Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 211 | హైదరాబాద్ | బుధవారం 24 జూన్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# పైచేయి ఎవరిది?!

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిదా?.. సీఎం రేవంత్‌రెడ్డిదా?

కీలకంగా మెట్రోకు నిధుల సాధన

వ్యూహాత్మకంగా టార్గెట్ చేసిన సీఎం

తక్షణమే స్పందించిన కేంద్రమంత్రి

ముమ్మందు కూడా కలిసి నడిస్తేనే ప్రయోజనం



(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

కొన్ని రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి వర్సెస్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మధ్య సాగిన రాజకీయ పోరు కీలక మలుపు తిరిగింది. దీంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. హైదరాబాద్ మెట్రో రైల్ రెండో విడత విస్తరణ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, అనుమతులు సాధించే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసిన వ్యూహాత్మక అడుగులు మంచిఫలితాన్నే ఇచ్చినట్లు కనిపిస్తోంది. మెట్రోకు నిధులు సాధించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలివిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉన్న జి. కిషన్ రెడ్డిని టార్గెట్ చేశారు. ఆయన చేసిన రాజకీయదాడిని తప్పించుకోలేని పరిస్థితి కల్పించారు. తెలంగాణలో రాజకీయంగా ముందుకు సాగాలంటే తక్షణం స్పందించాల్సిన పరిస్థితి కల్పించారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఆశించినట్లుగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో సహా ఇతర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భేటీ కావడం వెనుక పైచేయి ఎవరిది అనే విషయాన్ని పక్కన పెడితే.. ఈ పరిణామామం మాత్రం తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు.

రేవంత్ దూకుడు.. కిషన్ దౌత్యం

ఈ మెట్రో విస్తరణ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రిత్వ శాఖల ఆమోదం లభిస్తే ఆ క్రెడిట్ అంతా కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్తుందనే ఆందోళన బీజేపీ శ్రేణుల్లో సహజంగానే ఉంటుంది. అయితే రేవంత్ రెడ్డి వేసిన పొలిటికల్ చెక్‌తో.. కిషన్ రెడ్డి ఈ ప్రాజెక్టును తన భుజాలకెత్తుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ముందుగా ఐఆర్‌ఎఫ్‌సీ లోన్ క్లియర్ కావాలి. తర్వాత శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్, ఓల్డ్ సిటీ కనెక్టివిటీతో కూడిన రూ. 24,000 కోట్ల భారీ మెట్రో ఫేజ్-2 ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా స్పందించేలా చేయాలి. ఈ విషయంలో కిషన్ రెడ్డి చొరవ చూపడం

- మిగతా 2వ పేజీలో



## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని భేటీ

### కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంకేతాలా?

న్యూఢిల్లీ, జూన్ 23: త్వరలోనే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉండొచ్చన్న సంకేతాలకు ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భేటీ బలం చేకూరుస్తుంది. మంగళవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స్' వేదికగా విడుదల చేసింది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మరింత మంది మంత్రులకు పార్టీ బాధ్యతలను అప్పగిస్తారనే ప్రచారం జరుగుతుంది. దీంతో రాబోయేరోజుల్లో మరింతమంది రాజీనామా చేసే అవకాశం ఉందనే వాదనలు వినబడుతున్నాయి. అదే సమయంలో కొత్తవారిని మంత్రివర్గంలో తీసుకుంటారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



## ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం రేవంత్ పాస్

### హరీశ్ రావు

జూన్ 23 (ప్రజాతీర్పు)

మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ. 1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ. 2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు

- మిగతా 2వ పేజీలో



## హోర్ముజ్ దాటిన 11 నౌకలు

### భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూన్ 23 : భారతీయ జెండాలున్న 11 నౌకలు హోర్ముజ్ జలసంధిని దాటాయని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ప్రకటించారు. అమెరికా శాంతి ఒప్పందం తరువాత పశ్చిమాసియాలోని పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని మంగళవారం మీడియాకు వివరించారు. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా చమురు దిగుమతి చేసుకుంటామన్నారు. ఆరు ఎరువు సరఫరా నౌకలు, నాలుగు ముడి చమురు నౌకలు, ఒక ఎల్పీజీ నౌక జలసంధిని దాటాయని వివరించారు. మిగిలిన నౌకలు కూడా త్వరలోనే జలసంధిని దాటుతాయన్నారు. ఇంకా పది నౌకలు గల్ఫ్‌లోనే ఉన్నాయని, రెండు నౌకలు అక్కడకు చేరుకున్నాయని చెప్పారు. 140 కోట్లమంది పౌరులకు తక్కువ ధరలోనే ఇంధనం అందించడం ప్రభుత్వ విధానమన్నారు. రష్యా చమురు కొనుగోలుపై అమెరికా విధించిన ఆంక్షల గడువు వారం క్రితమే ముగిసిందని, ఇరాన్ సంస్థల నుంచి కొనుగోలు చేసేందుకు భారతీయ కంపెనీలకు అవకాశం లభించిందని జైస్వాల్ పేర్కొన్నారు.



## బీఆర్‌ఎస్ భారం కేటీఆర్‌దే!

వచ్చే ఎన్నికల్లో గెలిపించాల్సింది ఆయనే..

వయస్సు రీత్యా జనంలోకి రాని కేసీఆర్

ముప్పేటదాడి చేస్తున్న పార్టీలు

ఇప్పటికే ప్రజాసమస్యలపై గళం విప్పుతున్న యువనేత

పాదయాత్రతో జనంలోకి వెళ్లాలని ప్లాన్

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీగా.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీగా పేరున్న బీఆర్‌ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఇప్పుడు మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భుజస్కంధాలపై పడింది. పదేళ్ల పాటు సీఎంగా ఉన్న కేసీఆర్ తన ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో పూర్తిస్థాయిలో ప్రజల్లోకి రాలేకపోతున్నారు. ఆయన వచ్చే ఎన్నికల నాటికి ముఖ్యమైన నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నా.. అది ఎంత వరకు సాధ్యం అన్నది ఇప్పుడే చెప్పలేం. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించే బాధ్యతను పూర్తిగా కేటీఆర్ తీసుకోక తప్పని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ మనుగడ.. గులాబీ పార్టీ భవితవ్యం అంతా ఇప్పుడు కేటీఆర్ చేతుల్లోనే ఉందని అంటున్నారు.

**మూడు పార్టీల ముప్పేట దాడి**

మాజీ మంత్రి కేటీఆర్ ప్రతి సమావేశంలోనూ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని ఘంటాపథంగా చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ

- మిగతా 2వ పేజీలో



## 'పద్మ' అవార్డుల ప్రదానం

రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. 2026 సంవత్సరానికి సంబంధించి గణతంత్ర దినోత్సవమైన జనవరి 26న ఈ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది మొత్తం 131 మందిని ఈ పద్మ అవార్డులతో గౌరవించారు. ఇందులో ఐదుగురికి పద్మ విభూషణ్, 13 మందికి పద్మ భూషణ్, 113 మందికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. అవార్డులు అందుకున్న వారిలో మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, మమ్ముట్టి, ఆర్ మాధవన్, ఆల్కా యాగ్నిక్ ఉన్నారు.





2లో

## మెట్రోపై 'కలిసి' వెళ్దాం!

హైదరాబాద్ మెట్రో నిర్వహణకు 'జైపూర్ మోడల్'!

సీఎం రేవంత్‌రెడ్డికి సూచించిన కేంద్రం

కేంద్ర మంత్రి ఖట్టర్‌తో రేవంత్, కేంద్రమంత్రులు వైష్ణవ్, కిషన్‌రెడ్డి భేటీ

మెట్రో ఫేజ్--1 వాల్యూయేషన్‌కు ఎస్‌బిఐ క్యాప్స్‌కు బాధ్యత

## ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, తుమ్మల వినతి

సీఎంఆర్ సరఫరా గడువును పొడిగించాలని కోరుతూ లేఖ

కేంద్రం తక్కువ లక్ష్యాలతో రాష్ట్రంపై రూ.16,446 కోట్ల అదనపు భారం

రైతుల నుంచి ప్రతి గింజనూ ఎంఎస్‌పీకే కొంటాం: ఉత్తమ్

2లో





# రైతులపై ప్రయోగమా?

విడుదల కాని వరి వంగడాల సాగుకు సర్కారు సై

మార్కెట్‌లోకి రాని కేఎన్ఎం 7715

నాటాలంటూ ప్రభుత్వం రూల్

ఈవానాకాలం ఏడు రకాల సన్నాలకే బోనస్

రెండు ప్రైవేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికేనా?

సర్కార్ సరికొత్త మెలికపై అనుమానాలు

ఆంక్షలపై అన్నదాత ఆగ్రహం

మేడ్చల్, జూన్ 23: ఏడు రకాల వడ్లకే బోనస్ ఇవ్వాలన్న సర్కారు నిర్ణయం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖ ఎంపిక చేసిన ఏడు రకాల్లో రెండు ప్రైవేటు కంపెనీలకు చెందినవి ఉండడంతో.. వాటికి లబ్ధి చేకూర్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నారన్న ఆరోప ణలు వినిపిస్తున్నాయి. అంతేగాక మరొక రకం ఇంతవరకు మార్కెట్‌లోకి అధికారికంగా విడుదల కాలేదు. కానీ, ఆ విత్తనాన్ని నాటాలని ప్రభుత్వం సూచించడం విస్మయం కలిగిస్తోంది. పరిశోధనలకే పరిమితమైన వంగడా లను నాటాలనడం రైతులపై ప్రయోగం చేయడమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవు తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు లు బోనస్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, కేవలం సన్న రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని సర్కారు మెలిక పెట్టింది. బోనస్ వస్తుందన్న ఆశతో రైతులు సన్న రకాలు సాగు చేశారు. అయితే, ప్రభుత్వం ఈ వానాకాలం సరికొత్త మెలికలు పెట్టింది. గతంలో 33 రకాలకు బోనస్ చెల్లించగా, ఈసారి అందులో నుంచి 26 రకాలను తొలగించింది. కేవలం 7 రకాలకు మాత్రమే చెల్లిస్తామని, ఆ రకాలను ప్రకటించింది.

### రెండు ప్రైవేట్ కంపెనీలు మహారాష్ట్రకు చెందినవి..

రెండు ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం ఏడు రకాల సన్నాలకే బోనస్ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీపీటీ 5204 (సాంబ మసూరి), ఆర్ఎన్ఆర్ 15048(తెలంగాణ సోనా), హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638 (కూనారం సన్నాలు), డబ్ల్యూజీఎల్ 44(సిద్ధి), కేఎన్ఎం 7715 రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఇందులో 5 రకాలు ప్రభుత్వానికి చెందినవి కాగా, రెండు రకాలు మహారాష్ట్రకు చెందిన ప్రైవేటు కంపెనీలవి. ప్రభుత్వ విత్తనాలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో కార ణంతో సాగు చేయడానికి రైతులు ఇష్టపడరు. అయినప్పటికీ ఆ రెండు కంపెనీలకు చెందిన విత్తనాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. బీపీటీ 5204 (సాంబ మసూరి) 150 రోజుల పంట. దీనికి మే 15వ తేదీ లోపే నారు పోయాల్సి ఉంటుంది. ఈ రకాన్ని తెలంగాణలో ఎక్కువగా సాగు చేయరు. నిజామాబాద్ జిల్లాలో బోధన్ డివిజన్‌లో మూడు నాలుగు మండలాల్లో మాత్రమే సాగు చేస్తారు. ఇక ఆర్ఎన్ఆర్ 15048(తెలంగాణ సోనా) రకం తినడానికి బాగుంటుంది. డయాబెటిక్ రోగులు కూడా ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ, సాగుపరంగా వర్షంలో పండదు. ఆగస్టులో నాటుకోవలసి ఉంటుంది. కాటుక తెగులు ఎక్కువగా సోకుతుంది.

### ప్రయోగశాల నుంచి పొలంలోకి..

ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాల్లో కేఎన్ఎం 7715 ఒకటి. దీన్ని కూనారం వరి పరిశో ధన కేంద్రంలో రూపొందించారు. ఈ రకానికి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చాయి. కానీ, వీటిని వ్యవసాయ శాఖ అధికారికంగా మార్కెట్ లోకి విడుదల కాలేదు. అధికారికంగా విడుదల కానందున విత్తనాలు విక్రయించడానికి వీల్లేదు. ఒక విత్తనం అధికారికంగా విడుదల కావాలంటే చిరు సంచుల పథకం కింద రైతులు మూడేళ్లు ప్రయోగాత్మకంగా పండించాలి. ఈ మూడేళ్లలో దిగుబడి, నాణ్యత, తెగుళ్లను తట్టుకోవడం తదితర సమాచారం సేకరిస్తారు. మంచి ఫలితాలు కనబడితే ప్రభుత్వం ప్రపోజ్ చేస్తుంది. వెరైటీ రిలీజ్ కమిటీ సమావేశమై దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఈ రకం రిలీజ్ కమిటీకి ప్రపోజ్ చేశారు. కానీ ఇంకా నిర్ణయం వెలువడ లేదు. సీడ్ సర్టిఫై ఏజెన్సీ కూడా సర్టిఫై చేయాలి. అప్పుడే విత్తనాలు విక్రయించడానికి వీలవుతుంది. ఏడు రకాలకే బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వ ప్రకటన పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకోగా, మరికొందరు బోరుబావుల కింద నారు పోసుకు న్నా రు. నారు పోసుకున్న రైతులు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సన్న రకాల సాగుకు ఆంక్షలు పెట్టడం ఏమిటని అంటున్నారు.

### ప్రైవేటు విత్తన కంపెనీలకు శరాఘాతం

ప్రభుత్వ నిర్ణయం ప్రైవేటు విత్తన కంపెనీలకు శరాఘాతమైంది. అన్ని కంపెనీలు వానాకాలం పంటకు విత్తనాలు సిద్ధం చేశాయి. ప్రభుత్వం అకస్మాత్తుగా ఏడు రకాల కే బోనస్ అని ప్రకటించడంతో తమ పరిస్థితి ఏమిటని? కంపెనీల యజమానులు వాపోతున్నారు.

# వర్షాకాలంలో వంటకు తంటా!

కేసముద్రం, జూన్ 23 : ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కిచెన్ షెడ్లు నిర్మించలేదు. దీంతో మండల వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 57 ప్రభుత్వ విద్యాలయాలు ఉండగా అం దులో 4,000 వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన మౌలిక వసతులు అనేక పాఠశాలలో ఇప్పటివరకు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట వండి పెట్టే ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పాఠశాలల్లో నీటి వసతి లేదని, చాలా చోట్ల కిచెన్ షెడ్లు లేవని , దీనితో పాఠశాలల ఆవరణలో వరండాలు, చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

## ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం

# రేవంత్ పాస్

(మొదటి పేజీ తరువాయి)

విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3 వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడుతున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు హరీశ్ రావు. సీఎం మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర 3 శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ఫ్లాప్ అయిందని హరీశ్ రావు పేర్కొన్నారు.

# పైచేయి ఎవరిది?!

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతించదగ్గ పరిణామం. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి దూకుడు, మరోవైపు కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి రాయబారం వెరసి.. ఇప్పుడు హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు ఒక స్పష్టమైన దారి చూపేలా అడుగులు పడుతున్నాయి.

### క్రెడిట్ ఎవరి ఖాతాలో..

ప్రస్తుతానికి ఇద్దరు నేతలూ అభివృద్ధి కోసం కలిసి నడుస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, తెరవెనుక క్రెడిట్ కోసం అంతర్గత యుద్ధం నడుస్తూనే ఉంది. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయినా క్రెడిట్ ఆశించడం సహజం. కానీ, ఆ క్రెడిట్ పాలిటిక్స్ కాస్తా ప్రాజెక్టు పురోగతిని అడ్డుకునే స్థాయికి వెళ్లకూడదు. కేంద్ర–రాష్ట్రాల మధ్య నిధుల వాటా, రుణాల సమీకరణ వంటి సాంకేతిక అంశాల్లో ఇద్దరు నేతలూ పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవేళ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు విషయంలో కూడా ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు బురదజల్లుకుంటూ, రాజకీయ లబ్ధి కోసం కాలయాపన చేస్తే.. భవిష్యత్తులో తెలంగాణకు సంబంధించిన ఇతర భారీ ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడుతుంది.

### మున్ముందు కూడా..

మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, రీజినల్ రింగ్ రోడ్ వంటి కేంద్ర భాగస్వామ్య ప్రాజెక్టులు లైన్లోకి రావాలంటే.. ప్రస్తుత మెట్రో వివాదం ఒక హెల్తీ కో–ఆపరేటివ్ మోడల్‌గా మారాలి. అలా కాకుండా కేవలం మైకుల్లో తిట్టుకుంటూ కూర్చుంటే, కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో తెలంగాణకు నిధులు రాబట్టడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడటంలో మెట్రో రైలు వ్యవస్థ అత్యంత కీలకం. రేవంత్ రెడ్డి వేసిన రాజకీయ వ్యూహం కిషన్ రెడ్డిని కదిలించిన మాట వాస్తవమే అయినా.. ఇకపై రాజకీయాన్ని పక్కనబెట్టి అభివృద్ధి కోసం కలిసి నడిస్తే తెలంగాణలో అభివృద్ధికి మరిన్ని బీజాలు పడుతాయి.



# బీఆర్ఎస్ భారం కేటీఆర్‌దే!

(మొదటి పేజీ తరువాయి)

అబద్ధపు వాగ్దానాలు, హామీలతో గద్దెనెక్కిందని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని చెబుతున్నారు. రోజు చోట సభలు..సమావేశాలు పెడుతూ జనంతో.. నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ గళం వినిపిస్తున్నారు. కానీ, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాలు కేటీఆర్ చెప్పినంత ఈజీగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పలేమని అంటున్నారు. ఎందుకంటే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటి పోయింది. అయినా, ఇంకా ప్రజల్లో బీఆర్ఎస్ చెప్పినంతగా వ్యతిరేకత అయితే లేదు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయంతో పాటు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇలా పలు పథకాలతో ప్రజల్లో కాంగ్రెస్‌కు మంచి పేరే ఉంది. అలాగే, రేవంత్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకం ఇంకా సన్నగిల్లినట్లు కూడా పెద్దగా కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ పాగా వేసే ప్రయత్నం చేస్తోంది. ఇంత కాలం నగరం, పట్టణాలకే పరిమితమైన పార్టీ చాపకింద నీరులా పల్లెల్లోనూ విస్తరిస్తోంది. యువతను ఆకర్షించే కార్యక్రమాలను చేపడుతోంది. మరోపక్క సొంత సోదరి రోజూ బీఆర్ఎస్‌పై విమర్శల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. ఇవన్నీ కేటీఆర్‌కు హార్డిల్స్‌గా మారే అవకాశం ఉంది. వీటన్నింటినీ దాటి ఆయన ప్రజల్లో బలం పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

### పాదయాత్ర ప్లాన్ సక్సెస్ అయ్యేనా..

మళ్లీ అధికార పీఠం దక్కించుకునేందుకు వైఎస్, చంద్రబాబు, జగన్, రేవంత్ బాటలోనే కేటీఆర్ కూడా పాదయాత్ర చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. రాష్ట్రం మొత్తం పాదయాత్ర చేయాలంటే కనీసం ఏడాదిన్నర పడుతుందని అంచనా వేస్తున్నారు. అంటే, మిగిలేది ఆరు నెలలే. పాదయాత్ర వంటి సుదీర్ఘ ప్రక్రియ పూర్తి చేసుకుని అభ్యర్థుల ఎంపిక, మేనిఫెస్టో వంటివి తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆయన శారీరక, రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని ఈ సుదీర్ఘ యాత్రను విజయవంతంగా పూర్తి చేయగలిగితే.. ఆయన కేసీఆర్ నీడ నుంచి బయటపడి స్వయంప్రకాశిత లీడర్‌గా ఎదగడమే కాకుండా 2028 ఎన్నికలకు పక్కా సీఎం క్యాండిడేట్‌గా ప్రజల్లో రిజిస్టర్ అవుతారు.

# ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

## కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, తుమ్మల వినతి

- సీఎంఆర్ సరఫరా గడువును పొడిగించాలని కోరుతూ లేఖ
- కేంద్రం తక్కువ లక్ష్యాలతో రాష్ట్రంపై రూ.16,446 కోట్ల అదనపు భారం
- రైతుల నుంచి ప్రతి గింజనూ ఎంఎస్‌పీకే కొంటాం: ఉత్తమ్



న్యూఢిల్లీ: రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి వస్తున్న నేపథ్యంలో కేంద్రం నిర్దేశించిన సేకరణ లక్ష్యాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అదేవిధంగా కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువును కూడా పొడిగించాలని విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఉదయం ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రల్హాద్ జోషితో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాలంటూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేస్తోందన్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ : దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, ఈ కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని ఉత్తమ్ తెలిపారు. ఖరీఫ్, రబీ కలిపి 2025--26 మార్కెటింగ్ సీజన్‌లో తెలంగాణలో 152 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగి చరిత్రాత్మక రికార్డు నమోదైందన్నారు. రబీ 2025--26 సీజన్‌కు సంబంధించి 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలను రాష్ట్రం సమర్పించగా, కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని చెప్పారు. గత మూడు సీజన్లలో కేంద్రం లక్ష్యాలకు మించి రాష్ట్రం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని, దీనివల్ల రూ.16,446 కోట్ల అదనపు భారం పడిందన్నారు.

### సీఎంఆర్ గడువు పొడిగించాలి

నిల్వ స్థలాల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగుడం, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి వంటి కారణాల వల్ల సీఎంఆర్ సరఫరాలో గడువులను పొడిగించాల్సిన అవసరం ఉందని ప్రల్హాద్ జోషికి ఉత్తమ్ వివరించారు. రబీ 2024--25 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 2025--26 గడువును 120 రోజులు పొడిగించాలని కోరారు. రబీ 2025--26 సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నుంచి 54.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి పెంచాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. రబీ వరి ఎక్కువగా ఉప్పుడు బియ్యం తయారీకి అనుకూలంగా ఉండటంతో బాయిల్డ్ రైస్ రూపంలో సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఖరీఫ్ 2026--27 సీజన్‌కు సంబంధించి కేంద్రం నిర్ణయించే సేకరణ లక్ష్యాలు.. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలన్నారు. రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని, వారు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర లభించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ చెప్పారు.

# మెట్రోపై 'కలిసి' వెళ్దాం!

## హైదరాబాద్ మెట్రో నిర్వహణకు 'జైపూర్ మోడల్'! .. సీఎం రేవంత్‌రెడ్డికి సూచించిన కేంద్రం

- కేంద్ర మంత్రి ఖట్టర్‌తో రేవంత్, కేంద్రమంత్రులు వైష్ణవ్, కిషన్‌రెడ్డి భేటీ
- మెట్రో ఫేజ్-1 వాల్యూయేషన్‌కు ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యత
- రుణసంస్థ ఎంపిక, ఫేజ్--2 విస్తరణ,ఇతర అంశాలపై అధ్యయనం
- ఈ ప్రక్రియ వేగవంతానికి కేంద్ర,రాష్ట్ర అధికారులతో సమన్వయ కమిటీ
- కేంద్రంతో చర్చలు ఫలప్రదం: రేవంత్
- రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నా: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ : హైదరాబాద్ మెట్రో రైల్వే వ్యవస్థ పురోభివృద్ధిలో సంయుక్తంగా సాగాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. మెట్రో నిర్వహణ, అభివృద్ధి కోసం'జైపూర్ మోడల్'ను కేంద్ర మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డి ముందుపెట్టినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ సూచనకు సీఎం రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఢిల్లీలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా రేవంత్ మంగళవారం ఉదయం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఆయన నివాసంలో కలిశారు. మెట్రో ఫేజ్--1 వాల్యూయేషన్, ఫేజ్--1 స్వాధీనానికి అవసరమైన రుణసేకురణ, రుణ సంస్థ ఎంపిక, ఫేజ్--2 విస్తరణ, నిర్మాణ వ్యయం తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ అధ్యయనం చేయడానికి ఎస్‌బీఐ క్యాప్స్ (ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్)ను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. అధ్యయనంలో సమన్వయానికి కృషి చేసేలా జాయింట్ కమిటీలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారిని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిని ప్రతినిధులుగా ఉంచాలని నిర్ణయించారు. ఎస్‌బీఐ క్యాప్స్ సమర్పించే నివేదిక ఆధారంగా మెట్రోపై తదుపరి కార్యాచరణను నిర్ణయించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయంటూ రేవంత్‌రెడ్డి ఈ భేటీ అనంతరం ఒక ప్రకటనలో వెల్లడించారు. కిషన్‌రెడ్డి కూడా ఈ చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

### ఐఆర్ఎఫ్‌సీ రుణం లేనట్లే...

హైదరాబాద్ మెట్రో ఫేజ్--1లో ఈక్విటీ షేర్ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15వేల కోట్ల మేర ఫైనాన్సింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) మధ్య ఇప్పటికే చర్చలు జరిగాయి. ఒప్పందం ప్రకారం ఈనెల 15న మొదటి విడత రుణం విడుదల కావాల్సి ఉన్నప్పటికీ అది కుదరలేదు. దీనిపై రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి ఒకరిపై ఒకరు ప్రత్యారోపణలు చేసుకున్న సంగతి తెలిసిందే. చివరకు ఇద్దరూ కలిసి కేంద్ర మంత్రులతో జరిపిన తాజా చర్చల్లో మెట్రో ఫేజ్--1 వాల్యూయేషన్ చేయాలని నిర్ణయించారు. ఎస్‌బీఐ క్యాప్స్ నివేదిక ప్రకారం రుణ సంస్థను ఎంపిక చేస్తారు. అది ఐఆర్ఎఫ్‌సీ అవుతుందా, లేదా మరో సంస్థ నుంచి రుణం తీసుకోవాలా అనేది భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

### కీలక దిశగా అడుగులు

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో 2017లో ప్రజలకు అందుబాటులోకి వచ్చిన హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్--1ను గత ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుంది. అప్పటివరకూ దీన్ని నిర్మించి, నిర్వహించిన ఎల్ అండ్ టీ కోవిడ్ తర్వాత వచ్చిన నష్టాల కారణంగా వైదొలగాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జైపూర్ మోడల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఫేజ్--2 నిర్మాణం, నిర్వహణ చేపడితే కీలక పరిణామమే అవుతుంది.

### ఏమిటీ జైపూర్ మోడల్?

రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో మెట్రో రైల్వే వ్యవస్థ 2015 జూన్ నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఇది కూడా ఫేజ్--2 విస్తరణ దశలో ఉంది. ప్రారంభంలో జైపూర్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నప్పటికీ, తర్వాత కేంద్ర మెట్రో రైలు పాలసీ ప్రకారం ఇది కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్య సంస్థగా రూపాంతరం చెందింది. ఇటీవల ఆమోదించిన ఫేజ్--2 విస్తరణ పనులను 'రాజస్తాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్' అనే సంస్థ ద్వారా 50:50 సంయుక్త భాగస్వామ్యంతో రెండు ప్రభుత్వాలు కలిసి చేపడుతున్నాయి.



## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఘన నివాళులు

**కోరుట్ల జూన్ 23 (ప్రజాతీర్పు)**

భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనూప్ రావు, సీనియర్ నాయకుడు రుద్ర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రత, అఖండత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. "ఒకే దేశంలో రెండు ప్రధానులు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదు" అనే సిద్ధాంతంతో ఆయన పోరాడారని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక జెండా, ప్రత్యేక రాజ్యాంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో సంపూర్ణంగా విలీనమైందని, దీంతో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు న్యాయం జరిగినట్లు పేర్కొన్నారు. దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం భావితరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, గాందే నవీన్, సీనియర్ నాయకులు పోతుగంటి శ్రీనివాస్, మైదం సత్యనారాయణ, రాధారపు సత్యనారాయణ, నేమూరి విజయ్, ఓం ప్రకాష్, ఉప్పులూటి రాఘవులు, చిట్యాల రాజేంద్రకుమార్, ధమ్మా సంతోష్, దామ శ్రవణ్, తైదల ప్రశాంత్, వాసం లోకేష్, గడ్డం రాజశేఖర్, నారవేని విజయ్, బాల్క ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.



## రైతు వేదికలలో విత్తనమేలను ప్రారంభించిన సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 23**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతు వేదికలలో విత్తనమేల కార్యక్రమం లో భాగంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నల రైతు వేదిక లోని విత్తన మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ కార్యక్రమాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలలో డీలర్లచే ఏర్పాటు చేసినటువంటి విత్తన స్టాళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం అక్కడికి వచ్చినటువంటి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ విత్తనమేల కార్యక్రమాలను ఈనెల 30వ తారీకు వరకు అన్ని రైతు వేదికలలో నిర్వహిస్తుందని, ముఖ్యంగా వరిలో డిమాండ్ ఉన్న విత్తనాలను మాత్రమే రైతులు కొని సాగు చేసుకోవాలని వాటిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వాటి నిలువలను అన్ని రైతు వేదికల్లో ఈ 30వ తారీకు వరకు అందుబాటులో ఉంచుతుందని, రైతులు సద్వినియం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని విత్తన రకాల రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సబ్సిడీ కంది విత్తనాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో కన్నల సర్పంచ్ నేతరి మల్లమ్మ ఉప సర్పంచ్ తోకల సూరమ్మ చంద్రవెల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ చింత స్వామి బెల్లంపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజా నరేందర్,బెల్లంపల్లి వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్,బెల్లంపల్లి ఉద్యానవనధికారిని అర్చన, బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్.తిరుపతి,బెల్లంపల్లి మండలంలోని డీలర్లు మరియు రైతులు పాల్గొన్నారు. గురజాల ఏఈఓ,గౌసియ బేగం, గురజాల రైతువేదిక లో విత్తన మేళా నిర్వహిచారు

# ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్టీసీ రెవెన్యూ పెంచే విధంగా ప్రజలు సహకరించాలి..
- ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11రూట్లలో ఆర్టీసీ సర్వీసులు..
- ధర్మపురి నుంచి నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి అడ్లూరి..

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూన్ 23**




తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ధర్మపురికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్ కు రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ధర్మపురి బస్టాండ్ లో ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ధర్మపురి శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం నిర్మల్ నుంచి ధర్మపురి వరకు ఎక్స్ ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని మంత్రి అన్నారు. ఉదయం 7గంటలకు నిర్మల్ నుంచి దస్తురాబాద్, కడెం, ఖానాపూర్ మీదుగా ధర్మపురి వస్తుందని మంత్రి వివరించారు. రోజుకు రెండు ట్రిపుల చొప్పున నిర్మల్ -- ధర్మపురి మధ్య బస్సు నడుస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా ప్రయాణం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. కొత్త సర్వీస్ ఉదయం 7గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి, రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం మీదుగా కరీంనగర్ చేరకుంటుందని మంత్రి అడ్లూరి తెలిపారు. కొత్త సర్వీస్ విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగంగా ఉంటుందని మంత్రి తెలిపారు. అదే విధంగా కరీంనగర్ నుంచి రాత్రి 9గంటలకు ధర్మపురికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ మంత్రి పొన్న ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ చోరవతో ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి అనుమతి తీసుకున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థుల సౌకర్యం కోరకు నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి ఆదాయం వచ్చే విధంగా సహకరించాలని మంత్రి అడ్లూరి కోరారు. జిల్లా గంధ్రాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ ఆర్టీసీ సేవలు అందిస్తుందని అన్నారు. ధర్మపురికి వచ్చే భక్తుల కోసం నూతనంగా నడిపిస్తున్న సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని దినేష్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపాల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ ఎం నిర్మల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజాతీర్పు భైంసా) జూన్ 23**

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించి ఇంటి నిర్మాణం

- పనులు నిలిపివేయాలని కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూన్ 23:**



రంగంపల్లి 11వ వార్డులో మున్సిపల్ నిబం ధనలను ఉల ్లంఘిస్తూ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వెంటనే నిలిపి వేయాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం సమర్పిం చినట్లు తెలిపారు. స్థానికుడు పూదరి హరీష్ మాట్లా డుతూ.. పూదరి లక్ష్మి-- నర్సయ్య దంపతులకు మం జూరైన ఇందిరమ్మ గృహాన్ని ఎలాంటి సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్నారని ఆరోపించారు. తమ నివాస స్థలాన్ని సైతం ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ నిర్వహించి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ అండదండలతో అధికారుల సూచనలను బేఖాతరు చేస్తున్నారని అన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేసి తమ స్థలానికి రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

# భాషా వైవిధ్యం: దేశ ప్రగతికి బలమా? బలహీనతనా?

దేశం మొత్తం ఒకే భాష మాట్లాడితే అభివృద్ధి వేగంగా జరుగుతుంది అనే వాదన మన దేశంలో అడపాదడపా రాజకీయ, సామాజిక వేదికలపై తెరపైకి వస్తూనే ఉంటుంది. పాలనా సౌలభ్యం, విద్యా వ్యవస్థలో ఏకరూపత, వ్యాపార లావాదేవీల్లో సులభత వంటి కారణాలు చూపిస్తూ కొందరు మేధావులు, రాజకీయ నాయకులు ఈ వాదనను బలంగా వినిపిస్తుంటారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలు ఏకభాషా విధానంతో వేగంగా అభివృద్ధి చెందాయని ఉదాహరణలుగా చూపిస్తారు. మరోవైపు, ఇరవై రెండు అధికారిక భాషలు, వందలాది మాండలికాలు కలిగిన భారతదేశం వంటి బహుభాషా దేశం ఈ వైవిధ్యం కారణంగానే వెనుకబడిందా అన్నది నిజంగా పరిశీలించవలసిన ప్రశ్న. ఈ వ్యాసంలో ఈ వాదనలో ఎంత నిజముందో, వాస్తవానికి అభివృద్ధిని నిర్దేశించే అసలైన మానవీయ, ఆర్థిక అంశాలు ఏమిటో లోతుగా చర్చిద్దాం. ఏకభాష ఉంటే పరిపాలన సులభం అవుతుందనేది ఈ వాదన వెనుక ఉన్న ప్రధాన తర్కం. ప్రభుత్వ పత్రాలు, చట్టాలు, న్యాయస్థాన తీర్పులు ఒకే భాషలో ఉంటే అనువాదాల కోసం వెచ్చించే సమయం, మానవ వనరులు, భారీ ఖర్చు ఆదా అవుతాయని వాదిస్తారు. విద్యా రంగంలో కూడా ఒకే పాఠ్యపుస్తకం దేశమంతటా వాడుకలో ఉంటే నాణ్యతలో ఏకరూపత సాధించవచ్చని, విద్యార్థులు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్ళినా వారి చదువుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతారు. వ్యాపార రంగంలో అయితే, ఒకే భాషలో సంప్రదింపులు జరిగితే వ్యాపార ఒప్పందాలు, మార్కెటింగ్, కస్టమర్ సర్వీస్ వంటి అంశాలు సులభతరం అవుతాయని, అంతర్రాష్ట్ర వాణిజ్యం వేగంగా విస్తరిస్తుందని వాదిస్తారు. జాతీయ సమైక్యత దృష్ట్యా కూడా, ఒకే భాష ప్రజల మధ్య ఒక భావోద్వేగ బంధాన్ని పెంచుతుందని, మనమంతా ఒకటే అనే సమానత్వ భావనను బలపరుస్తుందని కొందరు భావిస్తారు. చైనా విషయంలో మాండరిన్ భాషను జాతీయ భాషగా ప్రోత్సహించడం వల్ల పరిపాలనా, విద్యా వ్యవస్థల్లో ఏకరూపత సాధ్యమైందని, ఇది ఆ దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడిందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడతారు. ఫ్రాన్స్‌లో కూడా ఫ్రెంచ్ భాషను బలంగా ప్రోత్సహించడం జాతీయ సమైక్యతకు తోడ్పడిందని చెబుతారు. ఈ వాదనను కేవలం పైపైన కాకుండా లోతుగా పరిశీలిస్తే, అనేక లోపాలు, అసంపూర్ణతలు కనిపిస్తాయి. ముందుగా, ఏక భాషా దేశాలే అత్యధికంగా అభివృద్ధి చెందాయన్న వాదన గణాంకపరంగా ఎక్కడా నిలబడదు. స్విట్జర్లాండ్ నాలుగు అధికారిక భాషలు (జర్మన్, ఫ్రెంచ్, ఇటాలియన్, రోమాన్ష్) కలిగి ఉన్నప్పటికీ ప్రపంచంలోనే అత్యంత సంపన్న, సుస్థిరమైన దేశాల్లో ఒకటిగా నిలుస్తోంది. అక్కడ భాషా వైవిధ్యం వారి ఆర్థిక వృద్ధికి ఎప్పుడూ అడ్డు రాలేదు. ఐరోపా సమాఖ్యలోని అనేక దేశాలు వేర్వేరు భాషలు మాట్లాడుతున్నా, పరస్పర సహకారంతో వాణిజ్యం, సాంకేతికత, విద్యా రంగాల్లో అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. సింగపూర్ నాలుగు అధికారిక భాషలతోనే ప్రపంచంలో అత్యంత పోటీతత్వ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదిగింది. కెనడా ఇంగ్లీష్, ఫ్రెంచ్ రెండు భాషలతో ద్విభాషా దేశంగా ఉన్నప్పటికీ అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ముందు వరుసలో ఉంది. దీనికి విరుద్ధంగా, ఒకే భాష మాట్లాడే ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాల్లోని అనేక దేశాలు తీవ్ర పేదరికంలో, అంతర్గత కలహాలలో, రాజకీయ అస్థిరతలో మగ్గుతున్నాయి. కాబట్టి భాషా ఏకరూపత అభివృద్ధికి గ్యారెంటీ కాదు, వైవిధ్యం వెనుకబాటుతనానికి కారణం కాదు అన్నది జగమెరిగిన సత్యం. భారతదేశం విషయానికి వస్తే, మన దేశం వెనుకబడటానికి భాషా వైవిధ్యం కారణమని చెప్పడం వాస్తవ దూరమైన వాదన. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి భారతదేశం ఇరవై రెండు అధికారిక భాషలతో, వందల మాండలికాలతో ముందుకు సాగుతూనే ఉంది. ఈ వైవిధ్య భరిత



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

వాతావరణంలోనే మనం సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచ శక్తిగా ఎదిగాం, అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్, మంగళయాన్ వంటి అద్భుత విజయాలు సాధించాం, ప్రపంచంలోనే అతిపెద్ద సార్వభౌమ ప్రజాస్వామ్యంగా నిలబడ్డాం. ఇవన్నీ భాషా వైవిధ్యం ఉన్నప్పటికీ, దానిని దాటుకుని సాధించిన అద్భుతాలు. నిజానికి, దేశంలో అభివృద్ధిని నిర్దేశించేది మాట్లాడే భాష కాదు; అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యా నాణ్యత, పరిపాలనా దక్షత, పెట్టుబడుల ప్రవాహం, సాంకేతిక పురోగతి, పారిశ్రామికీకరణ వంటి క్షేత్రస్థాయి అంశాలు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు తమ సొంత భాషలను, సాంస్కృతిక అస్తిత్వాన్ని బలంగా కాపాడుకుంటూనే ఆర్థికంగా, సామాజిక అభివృద్ధి సూచికల్లో దేశంలో ముందు వరుసలో నిలిచాయి. దీనికి విరుద్ధంగా, హిందీ ప్రధాన భాషగా ఉన్న కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు ఇప్పటికీ మానవ అభివృద్ధి సూచికల్లో వెనుకబడి ఉండటం గమనార్హం. అంటే భాష కాదు, పాలకుల దార్శనికత, పాలనా సామర్థ్యం, విధానాల అమలు తీరు మాత్రమే నిజమైన అభివృద్ధిని నిర్దేశిస్తాయని ఈ ఉదాహరణలు స్పష్టం చేస్తున్నాయి. చరిత్రను తిరగేస్తే, ఒక భాషపై మరో భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలు తరచూ తీవ్ర వ్యతిరేకతను, అంతర్గత విభజనను తెచ్చిపెట్టాయే తప్ప ఎక్కడా ఐక్యతను సాధించలేదు. 1965లో హిందీని ఏకైక అధికార భాషగా చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం తమిళనాడులో తీవ్ర వ్యతిరేకతకు, రక్తం చిందిన ఆందోళనలకు దారితీసింది. పొరుగు దేశమైన పాకిస్తాన్‌లో తూర్పు పాకిస్తాన్ ప్రజలపై ఉర్దూను బలవంతంగా రుద్దే ప్రయత్నమే చివరకు బంగ్లాదేశ్ ఆవిర్భావానికి, దేశ విభజనకు ప్రధాన కారణమైంది. ఈ చారిత్రక ఉదాహరణలు చూపేది ఏమిటంటే, భాషా వైవిధ్యాన్ని గౌరవించకుండా కృత్రిమంగా ఏకరూపతను రుద్దే ప్రయత్నాలు దేశ సమగ్రతకే ముప్పుగా మారే ప్రమాదం ఉంది. మాతృభాష అనేది కేవలం కమ్యూనికేషన్ సాధనం కాదు, అది ఒక వ్యక్తి ఆలోచనా సరళిని, సృజనాత్మకతను సజీవంగా ఉంచే అమూల్యమైన మాధ్యమం. మాతృభాషలో విద్యాబోధన పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని, మానసిక వికాసాన్ని అద్భుతంగా మెరుగుపరుస్తుందని యునెస్కో సహా అనేక అంతర్జాతీయ అధ్యయనాలు రుజువు చేశాయి. ప్రాథమిక విద్యను మాతృభాషలో అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల నుంచి మధ్యలోనే మానేసే పిల్లల (డ్రాపౌట్) రేటు తగ్గుతుంది, సబ్జెక్టులపై భావనా స్పష్టత పెరుగుతుంది. కాబట్టి భాషా వైవిధ్యాన్ని తొలగించి ఏకభాషను ప్రవేశపెట్టడం వల్ల విద్యా రంగంలో నష్టమే తప్ప లాభం ఉండదు. అయితే, దీని అర్థం భాషా ఏకరూపతలో ఎలాంటి ప్రయోజనమూ లేదని కొట్టిపారేయలేం. పరిపాలనలో, న్యాయ వ్యవస్థలో, అంతర్రాష్ట్ర వ్యాపారంలో ఒక సంధాన భాష (లింక్ లాంగ్వేజ్) ఉండటం వల్ల కొంత సౌలభ్యం ఉంటుందనేది వాస్తవం. అందుకనే మన రాజ్యాంగ శిల్పులు ఎంతో దూరదృష్టితో మూడు భాషల సూత్రాన్ని (త్రిభాషా సూత్రం) ప్రతిపాదించారు. మాతృభాష, జాతీయ సంధాన భాషగా హిందీ లేదా ఇంగ్లీష్, మరియు మరో భారతీయ భాష నేర్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహించడం ఇందులో భాగం. ఇది బలవంతపు ఏకభాషా విధానం కాదు, భాషా వైవిధ్యాన్ని కాపాడుతూనే దేశ సమైక్యతను, ఆర్థిక ప్రగతిని సాధించే సువర్ణ మార్గం. నిజమైన మానవీయ అభివృద్ధికి అవసరమైనది భాషా ఏకరూపత కాదు,సమాజంలో పరస్పర గౌరవం, అవినీతి లేని సమర్థవంతమైన పాలన, నాణ్యమైన ఉచిత విద్యా వైద్యాలు, ఉపాధి కల్పన. ఒక భాషను చట్టాల ద్వారా బలవంతంగా ప్రజలపై రుద్దడం కంటే, వివిధ భాషల మధ్య సామరస్యపూర్వక సహజీవనాన్ని ప్రోత్సహిస్తూ, అవసరమైన చోట ఒక ఉమ్మడి సంధాన భాషను ప్రజలే స్వచ్ఛందంగా స్వీకరించేలా వాతావరణాన్ని కల్పించడం మేలైన మార్గం. చివరగా చెప్పాలంటే, ఒకే భాష ఉంటే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది అనే వాదనలో పాక్షిక నిజం మాత్రమే ఉంది పరిపాలనా సౌలభ్యం వంటి కొన్ని తాత్కాలిక ప్రయోజనాలు ఉన్నాయన్నది వాస్తవమే అయినా, అది సర్వరోగ నివారిణి మాత్రం కాదు. భాషా వైవిధ్యమే మన భారతదేశం వెనుకబడటానికి కారణమనే వాదన చారిత్రక, ఆర్థిక వాస్తవాలకు పూర్తిగా విరుద్ధం. స్విట్జర్లాండ్, సింగపూర్, కెనడా వంటి బహుభాషా దేశాల విజయాలు, మన దేశంలోనే దక్షిణాది రాష్ట్రాల అద్భుత ప్రగతి ఈ విషయాన్ని నిరంతరం రుజువు చేస్తూనే ఉన్నాయి. భిన్నత్వంలో ఏకత్వం అనే మన దేశ మౌలిక ఆత్మను కాపాడుకుంటూనే, పరిపాలనా సామర్థ్యాన్ని, విద్యా నాణ్యతను, పారదర్శక ఆర్థిక విధానాలను మెరుగుపరచుకోవడమే నిజమైన అభివృద్ధికి బాట వేస్తుంది. భాషల వైవిధ్యం మన బలహీనత కాదు అది మన అమూల్యమైన సాంస్కృతిక సంపద, ప్రపంచంలో మన దేశానికి ఉన్న ప్రత్యేక గుర్తింపు. ఆ వైవిధ్యాన్ని గౌరవిస్తూ, కాపాడుకుంటూనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడం పూర్తిగా సాధ్యమే అని మన చరిత్ర, వర్తమానం ప్రపంచానికి చాటి చెబుతున్నాయి.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై బీఎల్ఏ లకు అవగాహన సమావేశం

- హాజరైన నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని బూత్ ల అధ్యక్షులు.
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి,నాయకులు పులి అనిల్ కుమార్.





**నర్సంపేట జూన్ 23 ప్రజా తీర్పు**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -2026 తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో పీసీసీ ఆదేశానుసారం నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని 283 బూత్ లెవెల్ ఏజెంట్లకు "సర్" ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మొదటి , రెండవ విడత జరిగిన ప్రక్రియలో అనేక మంది కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని అన్నారు. మన రాష్ట్రంలో ఆ పరిస్థితి రాకుండా పీసీసీ ఆదేశానుసారం ప్రతీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు ప్రత్యేక అవగాహన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మనం ప్రస్తుతం చేస్తున్న సమగ్ర జాబితానే ప్రదానం కానుందని అన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లకు ఈ కార్యక్రమం అత్యంత కీలకం అని , వారి ఈ నెల రోజులు శాయశక్తులా కృషి చేయాలని అన్నారు . ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ అనిల్ కుమార్ "సర్" ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బూత్ లెవెల్ ఏజెంట్లు, ముఖ్య నాయకులకు పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్,నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్ రెడ్డి,కిసాన్ సెల్ జిలా అధ్యక్షుడు దేవేందర్ రావు , మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పార్వతమ్మ , ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి , పీఏసీఎస్ చైర్మన్ రమణా రెడ్డి , మాజీ మార్కెట్ చైర్మన్ యాకూబ్ రెడ్డి, మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సాంబయ్య ,అన్ని మండలాల అధ్యక్షులు ,కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు ,



## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భూపాలపల్లి జిల్లా రవాణా అధికారికి ఘన నివాళులు

**(పాష సయ్యద్ ప్రజాతీర్పు వేములవాడ ) జూన్ 23:**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భూపాలపల్లి జిల్లా రవాణా అధికారి ఎం. వేంకన్నకు రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా రవాణా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంతాప సభలో అధికారులు, సిబ్బంది వేంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆకస్మిక మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అధికారులు, వేంకన్న సేవలను స్మరించుకున్నారు. రవాణా శాఖ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.వేంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణ అధికారి దేవనూరి శ్రీనివాస్ , ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారికి ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు ఎం వి ఐ వంశీధర్, సహాయక అధికారి పృథ్వీరాజ్ వర్మ, ఆఫీస్ సిబ్బంది కల్పన, కానిస్టేబుల్ రమ్య, సౌమ్య, ప్రశాంత్, హోంగార్డ్ లు యాసిన్, ఎల్లేష్, సభర్డినేట్ ప్రమీల, సిస్టమ్ ఆపరేటర్ కరుణాకర్, సౌమ్య లు పాల్గొన్నారు.



## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్ 23(ప్రజాతీర్పు ):**

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గ కార్యాలయంలో ఘన నివాళ్లులు అర్పించిన - రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట జూన్ 23 ప్రజా తీర్పు**

భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గ కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహోన్నత దేశభక్తులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివస్) కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లిభారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొని డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం లిరాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.... "ఒకే దేశంలో రెండు చట్టాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు చెల్లవు" (ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేంగే) అనే నినాదంతో దేశ సమగ్రత కోసం ముఖర్జీ పోరాడారని గుర్తుచేశారు. -జమ్మూ కాశ్మీర్‌ను భారతదేశంలో సంపూర్ణంగా విలీనం చేయడం కోసమే ఆయన తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి జైలులోనే అనుమానాస్పద స్థితిలో ప్రాణత్యాగం చేశారని, అందుకే ఈ రోజును బిజెపి శ్రేణులు 'బలిదాన్ దివస్' గా పాటిస్తున్నారని తెలిపారు. -ముఖర్జీ కన్న కలలను, ఆయన ఆశయాలను గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌లో 'ఆర్టికల్ 370' ని రద్దు చేయడం ద్వారా నెరవేర్చిందని స్పష్టం చేశారు. కాశ్మీర్ నేడు భారతదేశంలో పూర్తి అంతర్భాగంగా మారి అభివృద్ధి పథంలో దూసుకుపోవడమే ముఖర్జీ కి దక్కిన నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓ బి సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ ,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహారాములు , జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ ,పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచంద్ర రెడ్డి,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్,నర్సంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు,ముఖ్య నాయకులు,వివిధ మోర్చాల నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు....



## పెడిమల్ల రాజు ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న బిజెపి నేత సురభి నవీన్

**కోరుట్ల జూన్ 23 (ప్రజాతీర్పు )**

కోరుట్ల పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నవతెలంగాణ రిపోర్టర్ పడిమల రాజును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ వారి నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సురభి నవీన్ కుమార్‌తో పాటు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సొరుపాక రమేష్, మెట్‌పల్లి పట్టణ కౌన్సిలర్ బొడ్ల రమేష్, ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, కోరుట్ల మండల ప్రధాన కార్యదర్శి గోపు ప్రశాంత్, సీనియర్ నాయకులు సాడిగే మహేష్, గుండేటి సంజీవ్, బొల్లపెల్లి రాహుల్ గౌడ్ తదితర బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పడిమల రాజు పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి తన విధుల్లో చేరాలని వారు ఆకాంక్షించారు.



## శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా రక్తదాన శిబిరం

**మహనీయుడి సేవలను స్మరించుకున్న బీజేపీ నాయకులు**

**(దుర్గం నగేష్ , ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూన్ 23:**

భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పట్టణ మండల శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ, ఆధునిక భారతదేశ నిర్మాణంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ విశిష్ట సేవలు అందించారని అన్నారు. విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా, జాతీయవాదిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా విద్యా రంగంలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు కేంద్ర పరిశ్రమల మంత్రిగా కూడా కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. అనంతరం భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశ సమగ్రత కోసం ఉద్యమించారని పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని రద్దు చేయాలని పోరాడిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ 1953 జూన్ 23న కాశ్మీర్ జైలులో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 370వ అధికరణం రద్దు కావడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, సర్పంచ్ వేల్పుల రమేష్, పోల్సాని సంపత్‌రావు, కావేటి రాజగోపాల్, ఎర్రోళ్ల శ్రీకాంత్, గుడ్ల సతీష్, గాదాచి సతీష్, బొడ్డుపల్లి అంజి, కూషనపల్లి మధుకర్, శ్రీనివాస్, శివసాయి, శ్రీకాంత్, రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్వరలో దొంగలను పట్టుకుంటాం

**జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల**

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 23**



నిర్మల్ జిల్లా బాసర మహంకాళి ఆలయంలో చోరికి పాల్పడిన గుర్తుతెలియని దొంగలను అతి త్వరలోనే పట్టుకుంటామని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మహాంకాళి ఆలయాన్ని మంగళవారం ఉదయం పరిశీలించారు. పలు వివరాలను ఆలయ ఈవో అంజనీ దేవిని అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. మహంకాళి ఆలయంలో దొంగలు అమ్మవారి వెండి కిరీటం ను దొంగలించారని తెలిపారు. అలాగే హుండీ ఎత్తుకెళ్లి ఆలయ సమీపంలో వదిలి వెళ్ళారని తెలిపారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాలను పరిశీలించడం జరిగిందన్నారు. క్లూస్ టీమ్ ను రంగంలోకి దించామన్నారు.ఈ దొంగతనంపై అన్ని కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్పీ చెప్పారు. ఎస్పీ వెంట వెంట భైంసా ఎఎస్పీ పత్తిపాక సాయికిరణ్, ముధోల్ సిఐ రవీంద్ర నాయక్ ఉన్నారు.



## విత్తన మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి , కలెక్టర్ సత్యశారద

**నర్సంపేట జూన్ 23 ప్రజా తీర్పు**

నర్సంపేట మండలం గురిజాల గ్రామంలో ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారం రోజుల పాటు చేపట్టిన విత్తన మేళా కార్యక్రమాన్ని నేడు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి , కలెక్టర్ సత్యశారద తో కలిసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో దేశం వ్యాప్తంగా ముఖ్యంగా తెలంగాణ లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని, దీంతో రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మెట్ట పంటలు వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ లో 7 రకాల వరి ధాన్యలను సూచించిందని, ఈ రకాలను మాత్రమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వరిస్తుందని తెలిపారు. అలాగే వ్యవసాయంలో యూరియా వాడకం తగ్గించాలని, వ్యవసాయ అధికారులు తెలిపిన ప్రకారమే యూరియా వాడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల , ఏడీఏ శ్రీనివాసు, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవేందర్ రావు, రాష్ట్ర నాయకులు పులి అనిల్ కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ ,మండల పార్టీ అధ్యక్షుడు కిరణ్ , స్థానిక సర్పంచ్ చందర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ఖానాపూర్,జూన్ 23(ప్రజా తీర్పు ప్రతినిధి):**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్,విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు.పాఠ్య బోధనతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.కామన్ మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తెలిపారు.అనంతరం ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో డీఈఓ భోజన్న, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రావి దామోదర్ నామినేషన్

**జమ్మికుంట, జూన్ 23 ప్రజాతీర్పు**



జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు, అందరి ఆత్మీయుడు రావి దామోదర్ (కోరపల్లి) తన నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 28వ తారీకు ఆదివారం రోజున జరగనున్న పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కొరకు పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రావి దామోదర్ మాట్లాడుతూ... జమ్మికుంట పట్టణంలోని ఆర్యవైశ్య సోదర, సోదరీమణుల, కుటుంబ సభ్యులందరి అభిమానాలు, పెద్దల ఆశీర్వాద బలంతోనే తాను అధ్యక్ష పదవికి నామినేషన్ వేసినట్లు తెలిపారు. సమాజ సేవే ధ్యేయంగా, ఆర్యవైశ్య బంధువులందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. "ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమం, సంఘం అభివృద్ధి నా ప్రథమ ప్రాధాన్యత. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, మీ అందరి అమూల్యమైన సహాయ సహకారాలు అందించాలని వారు తెలిపారు.ఆర్యవైశ్య సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపించే తనను ఆశీర్వదించి, సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించాలని ఆయన పట్టణ ఆర్యవైశ్యులను అభ్యర్థించారు. నామినేషన్ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



# గంజాయి, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**కోరుట్ల జూన్ 23 (ప్రజాతీర్పు )**

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు పర్యవేక్షణలో, కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎస్సై ఎం. చిరంజీవి మాట్లాడుతూ, యువత కొత్త వ్యక్తుల పరిచయాలు, ఆసక్తి మరియు 'ఫస్ట్ టెస్ట్' కోరికతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోవడంతో పాటు మెదడు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, రక్తం మరియు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కోల్పోయి జీవిత లక్ష్యాలను చేరుకోలేకపోతారని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, విద్య మరియు సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్, సాహితి మేడం, ఇతర అధ్యాపకులు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి

## -ముందోల్ ఎం ఎల్ ఎ రామారావు పటేల్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్ 23(ప్రజాతీర్పు ):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం బాసర మండల కేంద్రంలో, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కలిగేలా 2 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. జెండా ఊపడం ద్వారా ర్యాలీని ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ బాసర మండలంలోని పలు వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అధికారులంతా ఎస్ఐఆర్ ప్రక్రియ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా సమగ్ర ఓటర్ జాబితా తయారవుతుందని తెలిపారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ప్రజలంతా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ పవన చంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# సోయాబీన్ విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 23**

ముధోల్ మండల కేంద్రంలని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ ఎం ఈ వో వో ఏస్ సోయాబీన్ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సోయాబీన్ విత్తనాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పక్షపాతం లేకుండా నిజమైన అర్హులైన రైతులకు విత్తనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంజీ ఎన్ అర్ ఈ జీ ఏస్ నిధులతో రూ.27 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.27 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, గోదాలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. అలాగే ముధోల్, అష్ట, ఎడ్‌బిడ్, బోరెగాం, ముద్గల్, రాంటెక్, మచ్కల్ గ్రామాలకు గోదాముల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేశారు. ఈ పనులు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**(వంజరపు) ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్) జూన్ 23**



మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగింపు దశలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలు ఇప్పటివరకు 95, 313 మంది రైతుల నుండి 4,21,083,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,90,221 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలో 928.85 కోట్ల రూపాయలు చెల్లింపు చేశామన్నారు. ఇప్పటివరకు 531 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జూన్ 23**



ఇల్లందు :మండలంలోని గ్రామ పంచాయతీలలో నెలకొన్న సమస్యలపై ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య.ఆధ్వర్యంలో కొమరారం సర్పంచ్ అజ్మీర బిచ్చ, మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు చిన్నచంద్రన్న, నాయిని రాజన్నలతో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డివెంకటరెడ్డిమంత్రినివాసంలో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యసమస్యల గురించి వివరిస్తూ, గత కొన్ని సంవత్సరాలుగా కొమరారం,పోచారం,బోయితండా,కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు(సైడ్ కాలువలు) లేకపోవడం, అట్లాగే కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మాణం, కొమరారం హైస్కూల్ ప్రహరీ నిర్మాణం లేక స్థానిక ప్రజలు విద్యార్థులు ఎన్నో ఆగచాట్లు ఇబ్బందులు పడుతున్నారనీ, అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాకాలం ప్రారంభం అవుతుంది కాబట్టి ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతం కనుక సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రికి వివరించారు. మంత్రివెంటనే స్పందించి స్థానిక జిల్లా కలెక్టర్ కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ మంజూరు చేయమని తన స్వంత లెటర్ హెడ్ పై సిఫారసు లెటర్ రాసి ఇవ్వడం జరిగింది. అట్లాగే ఇంకా తన దృష్టికి తీసుకెళ్లిన సమస్యలన్నింటినీ కూడా సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.



# బాసర మహంకాళి ఆలయంలో జరిగిన చోరీ ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రజనిది,జూన్ 23(ప్రజాతీర్పు ):**

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం పైఅంతస్తులోని మహంకాళి ఆలయంలో అమ్మవారి వెండి కిరీటం, హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మహంకాళి ఆలయ గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు కాజేసి.. అనంతరం హుండీ వ్యాసగుడి దగ్గర పడేసి పరారయ్యారు. అర్చకులు మంగళవారం తెల్లవారుజామున పూజ కోసం వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఘటన జరిగిన ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పరిశీలించి, చోరీ జరిగిన పరిస్థితులు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించిన ప్రతి కోణంలో దర్యాప్తు చేపట్టి, నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ , ఇన్స్పెక్టర్లు రవీందర్ నాయక్,సమ్మయ్య, ఎస్ఐ లు ఇతర పోలీసు సిబ్బంది , దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమాలు

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 23.**

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడే లక్ష్యంతో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు యువత ఆరోగ్యాన్ని, విద్యా భవిష్యత్తును, కుటుంబ సంబంధాలను మరియు సమాజ శాంతి భద్రతలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వివరించారు. ఈ సందర్భంగా పోలీసులు అదికారులు మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల వ్యసనం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధిని కూడా దెబ్బతీసే సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు స్నేహితుల ప్రభావం, తప్పుడు ప్రచారం లేదా ఆసక్తి కారణంగా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే గంజాయి, డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, రవాణా, నిల్వ మరియు విక్రయం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత తమ జీవిత లక్ష్యాల సాధన కోసం విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సమాజంలో ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఎక్కడైనా తెలిసినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలలో పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బ్యాంకు లు రైతులకు పంట రుణాలు సకాలంలో ఇవ్వాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న డిమాండ్

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జూన్ 23**

గార్ల: ఈ ఖరీఫ్ సీజన్ లో కల్తీ విత్తనాలు, నాసిరకం ఎరువు, పురుగు మందులను నివారించి, రైతులకు బ్యాంకులు సకాలంలో స్కెల్ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలను ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న డిమాండ్ చేశారు. రైతులకు యాసంగి వానాకాలంలో రైతు భరోసా ఇవ్వాలని, రైతు డిస్కంలను వెనక్కు తీసుకోవాలని,యూరియా యాపును రద్దు చేయ్యాలని,కేంద్ర ప్రభుత్వం పెంచిన పోటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి తాసిల్దార్ శారదకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రాలలో జులై 20,21,22 తేదీలలో తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధరావత్ కై బాబు, ధారావత్ బుజ్జి, వెంకట్ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు,వి వెంకటేశ్వర్లు, సి హెచ్ ఎల్లయ్య,బి.ఉపేందర్ రెడ్డి, ఐ గోవిందు, సి హెచ్ మౌనిక,ఎ.వీరస్వామి, కృష్ణ,కె.రామకృష్ణ,కందునూరి శ్రీనివాస్, గుండేటి వీరభద్రం, రైతులు పాల్గొన్నారు.



# శిక్షణ తరగతులలో పాల్గొన్న బెల్లంపల్లి చైర్ పర్సన్ దావ స్వాతి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జూన్ 23**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాసనసభ్యులు,గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు సెక్రటరీ టు గవర్నమెంట్ , మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ఉ కమీషనర్ అండ్ డైరెక్టర్ అఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎసి) డా.టీ. కే. శ్రీదేవి ఐఏఎస్,ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సోమాజిగూడ లో రాష్ట్రంలోని మేయర్ లు మరియు చైర్ పర్సన్ లకు నిర్వహించిన శిక్షణ తరగతులలో పాల్గొన్న బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి. దావ స్వాతి-రమేష్ బాబు.

# ముధోల్‌లో సీఎంటీసీ, జీఆర్‌సీ కేంద్రాల ప్రారంభం

- మహిళా సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక : ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 23**



నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో సీఎంటీసీ సీఎంటీ సీ, జీఆర్‌సీ కేంద్రాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వల మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే, మహిళా సంఘాలు కేవలం పొదుపు సంఘాలుగానే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే శక్తిగా ఎదిగాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తూ కుటుంబాల అభివృద్ధికి, సమాజ పురోగతికి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించడం, వడ్డీ రహిత రుణాలు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం అయితే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని, కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అలాగే సీఎంటీసీ, జీఆర్‌సీ కేంద్రాల ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం, మహిళల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# డ్రగ్స్ సమాచారాన్ని పోలీసులకు అందించండి

- 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుకు రండి..
- మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్ : ఎల్లారెడ్డిపేట రెండోవ ఎస్సై రజాక్

**ఎల్లారెడ్డి పేట జూన్ 23 ప్రజా తీర్పు ప్రతినిధి**

జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా,జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (×త్వతీఅఖ్ఱశీఖ్రీ ఝఎ చాస్త్రుఱఅర్ ఇతీబస్త్ర చాఎబంవ ఖఅస ×శ్రీశ్రీఱఎణ్ ుతీఝటటఱఎఏఐఅస్త్ర) సందర్భంగా రాజన్న సిరిసిల్ల ఎస్పీ ఆదేశాల మేరకు ఈ రోజున ధూమాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడ మైనది.ఈ సందర్భంగా రెండోవ ఎస్సై మాట్లాడుతూ.....మత్తు పదార్థాలు మొదట్లో ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, తరువాత అవి వ్యసనంగా మారి వ్యక్తి ఆరోగ్యం,భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు.మాదకద్రవ్యాల వల్ల శారీరక,మానసిక సమస్యలు తలెత్తడంతో పాటు కుటుంబాలు కూడాఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు.అందువల్ల విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని,అలాగే సమాజంలో ఎక్కడైనా ఇటువంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కష్టపడి పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమతోనే ఉన్నతాధికారులు, క్రీడాకారులు, కళాకారులు, నాయకులుగా ఎదగగలరని అన్నారు.లక్ష్యంపై దృష్టి సారించి కృషి చేస్తే ప్రతి విద్యార్థి జీవితంలో విజయాన్ని సాధించగలడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట కానిస్టేబుల్ అరవిందు, బాబయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# సీనియర్ సిటిజెన్లకు సర్కారు భరోసా

## ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూన్ 23**

జగిత్యాల జిల్లా :జన్మనిచ్చిన తల్లి దండ్రులు వృద్ధాప్యంలో నిరాధరణకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లి దండ్రుల భద్రత చట్టం-2026 తెచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వయోధికుల వేధింపుల నివారణకు అవగాహన పక్షో త్సవాల సందర్భంగా టాస్క ముద్రించిన అవగాహన పిలుపు పత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం లోని వృద్ధుల భద్రతకు, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.జిల్లా కేంద్రంలో ప్రభుత్వం తరపున తన వినతి మేరకు,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వృద్ధాశ్రమము నిర్మాణం పూర్తయ్యిందని త్వరలో అందుబాటులో కి వస్తుందని , అల్పాహారం, వైద్య సేవలు, వినోదకార్యక్రమాల కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయించామన్నారు. పిల్లల నిరాధరణకు గురవుతున్న సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారం, సంక్షేమము కోసం జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, వారి సంఘాల ప్రతినిధులు గౌరి శెట్టి విశ్వనాథం, పి. హన్మంత్ రెడ్డి,బొల్లం విజయ్,ఎం. డి. యాకూబ్ తదితరుల సేవలను అభినందించారు. సీనియర్ సిటిజెన్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సీనియర్ సిటిజెన్స్ కమిషన్ ఏర్పాటు కు సీ ఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజెన్స్ సేవలకు అసోసియేషన్ భవన్ నిర్మాణంకు ప్రభుత్వ స్థలం, నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా లో కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జగిత్యాల ఆర్డీ వో మధు సూదన్, కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మెట్ పల్లి ఆర్డీ వో జీ. నర్సింహా రావు లు వృద్ధులు కేసులు పరిష్కారం లో తమ అసోసియేషన్ సహకారం తో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లోమార్కెట్ చైర్మన్ నారాయణ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి.హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎం. డి. యా కూబ్, కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శులు కొయ్యడ సత్యనారాయణ, వొద్దినేని పురుషోత్తం రావు,బాలయ్య, సంయుక్త కార్యదర్శులు సయ్యద్ యూసుఫ్, ఎం. డి. ఇక్బల్,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి, ధర్మపూరి అధ్యక్షులు కండ్ గంగాధర్, కార్యదర్శి దుబ్బేశం,సారంగపూర్ అధ్యక్షులు కే. గంగ రెడ్డి, గొల్ల పెల్లి అధ్యక్షులు వీరా రెడ్డి, రాయికల్ అధ్యక్షులు వేణు గోపాల్ రావు మహిళా కార్యదర్శులు బొబ్బాటి కరుణ, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

# ఈ నెల 28 న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్ 23(ప్రజాతీర్పు ):**




ఈనెల 28వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 28వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, పోలియో చుక్కల ప్రాధాన్యతను వివరించాలని చెప్పారు. జూన్ 28వ తేదీ తర్వాత కూడా సిబ్బంది ఇంటింటికి వెళ్లి, చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. అలాగే రానున్న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగే అవకాశం ఉన్నందున వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశాభివృద్ధికి ఉపయోగపడే వనరులు, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం ముఖ్యం.
- ఎస్పీ నరసింహా ఐపీఎస్.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 23**



మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు సూర్యాపేట జిల్లా పోలీసుల అధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనంతగిరి మండల పరిధి అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల నందు విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పై పోలీసు ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ఉజ్వల భవిష్యత్తుపై అనుసరించాల్సిన విధివిధానాల పట్ల చైతన్యపరిచారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడే వనరులుగా ఎదగాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని కోరారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి, సమాజానికి ఉపయోగపడే వనరు కావాలి, ఇష్టం ఉన్న, నైపుణ్యం ఉన్న రంగంపై దృష్టి పెట్టాలి, గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప లీడర్స్ కావాలి అని ఎస్పి గారు విద్యార్థులను చైతన్య పరిచారు. యువత, విద్యార్థులు దేశ సంపద, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నది కావున విద్యార్థుల్లో, యువతలో మార్పు రావాలి, డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా ఉండాలి అని కోరారు. డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి, డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారు నేరాలకు పాల్పడుతున్నారు, అనారోగ్యాలకు గురౌతున్నారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలో యాంటీ డ్రగ్స్ టీమ్స్ ఏర్పాటు చేశాము, విద్యాసంస్థల్లో ఈ టీమ్స్ డ్రగ్స్ నిర్మూలనకు పని చేయాలి, అధికారులకు సమాచారం అందించాలి అన్నారు. సమాజంలో చెడ్డపేరు వస్తుంది అన్నారు. ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుంది అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరా చేయడం తీవ్రమైన నేరం అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన విద్యార్థులు, యువత గురించి సమాచారం ఇవ్వండి వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము, వీరిలో మార్పునకు కృషి చేస్తాము అన్నారు. మన సమాజంలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అన్నారు. సమాజంలో డ్రగ్స్ ను నిర్మూలించడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలి అని అన్నారు. సైబర్ నేరాలు అనేవి ఇప్పుడు సమాజంలో మరో పెద్ద సమస్య అని అన్నారు, సైబర్ నేరగాళ్లు ఉచితాలు ఆశలు చూపి ఆర్థికంగా నష్టపరుస్తారు, ఝూ లు, పిన్ నంబర్స్ చెపితే బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు పోతాయి అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ లో సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు అని ఎస్పి గారు కోరారు. ప్రస్తుత సమాజంలో మరో ప్రధాన సమస్య రోడ్డు ప్రమాదాలు వీటివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం అంతా సమస్యలు ఎదుర్కొంటుందని అన్నారు, విద్యార్థులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వాహనాలపై వేగంగా వెళ్ళవద్దు అని త్రిబుల్ రైడింగ్ లాంటివి నిర్వహించకూడదని బైక్ పై పందాలు పెట్టుకోకూడదని కోరారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు కలలు పిల్లలపై పెట్టుకుంటారని రోడ్డు ప్రమాదాలకు గురై తల్లిదండ్రుల కలలను ఆశలను అందాకారం చేయకూడదని అన్నారు. డ్రగ్స్ కు దూరంగా నిర్మూలనకు పాటుపడతాం డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి రహిత తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు చేయడంలో ముందుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పోలీసు కళాబృందం వారు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఝూ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ కుమార్, షి టీమ్ ఎస్ఐ మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేష్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఏం.ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



# ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**మంథని, జూన్-23 (ప్రజాతీర్పు)**

తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కావటి సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన కేకే కమిటీ నివేదికపై వెంటనే స్పందించి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, తగిన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి సంక్షేమం కోసం శైలా కమిటీని నియమించడం అభినందనీయమన్నారు. ఉద్యమకారుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు ఉద్యమ నాయకులు, ప్రతినిధులు పాల్గొని ఉద్యమకారుల సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు.




# ఖానాపూర్ ప్రభుత్వ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**ఖానాపూర్, జూన్23(ప్రజా తీర్పు ప్రతినిధి):**

యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, వాటి దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ యాంటీ-డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య,క్రమశిక్షణ,మంచి విలువలతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం వ్యాసరచన నిర్వహించగా,వారు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా యువతలో చైతన్యం పెంపొందించి, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గేట్ మీటింగ్‌లపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతాం
- కవిత పర్యటనను విజయవంతం చేసిన కార్మికులకు కృతజ్ఞతలు
- హెచ్ఎంఎస్ మందమరి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సిద్ధంశెట్టి సాజన్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జూన్ 23**



మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి కార్మికుల సమస్యలను,తెలుసుకోవడానికి, వాటి పరిష్కారం కోసం గేట్ మీటింగ్‌లు అత్యంత అవసరమని, వాటిపై ప్రభుత్వం, పోలీసులు, సింగరేణి యాజమాన్యం ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంగళవారం మందమర్రి లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సాజన్ అన్నారు.కవిత పర్యటనను విజయవంతం చేసిన కార్మికులకు కృతజ్ఞతలు కల్వకుంట్ల కవిత సింగరేణి పర్యటన సందర్భంగా కార్మికులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని సాజన్ పేర్కొన్నారు. కార్మికులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను వెల్లడించడం అభినందనీయమన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి కార్మికుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### గేట్ మీటింగ్‌లను అడ్డుకోవడం సరికాదు

కార్మికులు తమ సమస్యలను నేరుగా నాయకులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసే ప్రధాన వేదిక గేట్ మీటింగ్‌లేనని అన్నారు. గేట్లకు తాళాలు వేయడం, పోలీసు పహారా ఏర్పాటు చేయడం, విద్యుత్ సరఫరా నిలిపివేయడం వంటి చర్యలు కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను హరించే ప్రయత్నమని విమర్శించారు. ధర్నా చౌక్‌కు ఉన్న ప్రాధాన్యత గేట్ మీటింగ్‌లకూ ఇవ్వాలి,ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపించే ప్రతి వేదికకు సమాన ప్రాధాన్యత ఉండాలని సాజన్ పేర్కొన్నారు. ధర్నా చౌక్ ఎంత అవసరమో కార్మిక క్షేత్రాల్లో గేట్ మీటింగ్‌లు కూడా అంతే అవసరమని అన్నారు. కార్మికుల సమస్యలను వినకుండా ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదన్నారు.

### కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలి

కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యం, నాయకులు మరియు కార్మికుల మధ్య దూరం పెంచే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, బదిలీలు, డిప్యూటేషన్‌లు, వైద్య సేవల లోపాలు వంటి అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మహిళలను కించపరిచే వ్యాఖ్యలు ఖండనీయం

కొందరు వివిధ సంఘాలకు చెందిన నాయకులు మహిళలను కించపరిచే విధంగా పాటలు, వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని సాజన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు విధానాలపై ఉండాలే తప్ప వ్యక్తిగత దూషణలు, మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.

### కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్ పోరాటం కొనసాగుతుంది

సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం హెచ్ఎంఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని సాజన్ స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

### వైద్య సేవలు మెరుగుపర్చాలి

సింగరేణి ప్రాంతంలో మెడికల్ బోర్డుల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు.

### కార్మికుల ఐక్యతే విజయానికి బాట

కార్మికులు ఐక్యంగా ఉంటేనే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ భువన చంద్ర, ఏరియా నాయకులు నవీన్, కార్తీక్, హరీష్ కాసిపేట 1 ఫిట్ సెక్రటరీ ప్రిత్పాల్ సింగ్ కాసిపేట 2 ఫిట్ సెక్రటరీ పరుశురాం, శాంతిఖని ఫిట్ సెక్రటరీ లింగాల కిరణ్ మరియు నాయకులు శ్రవణ్, గౌతం, రవితేజ, విజయ్, పూర్ణ పాల్గొన్నారు

# అప్పుల బాధతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య

**ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని అభివర్ణించిన మాజీ సర్పంచులు, కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్**



**హుస్నాబాద్ జూన్ 23 ప్రజా తీర్పు**

అప్పుల బాధ ఎక్కువై మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన హుస్నాబాద్ మండలంలో జరిగింది. మండలంలోని మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన పిట్టల సంపత్ (48) ఉదయం వరకు గ్రామంలోనే ఉండి కలిసిన వాళ్లతో ఆప్యాయంగా మాట్లాడి ఉదయం 9 గంటల ప్రాంతంలో బావి దగ్గరికి వెళ్లి వడ్డీ వ్యాపారస్తుల బాధ ఎక్కువై మనస్తాపం చెంది తన యొక్క వ్యవసాయ బావి వద్ద గల చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని చనిపోయినట్లు చెప్పారు. అయితే అటుగా వెళుతున్న గొర్రెల కాపరి ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఆర్తనాధాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. తండోపతండాలుగా ఊరి ప్రజలు ఆ ప్రదేశానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే సంపత్ మహమ్మద్ పూర్ గ్రామానికి రెండు పర్యాయాలు గత ప్రభుత్వ హయాంలో 2014 , 2019 సర్పంచుగా సేవలు అందించారు. సర్పంచ్ గా అయితే రెండు పర్యాయాలు పనిచేశారు గాని పెట్టిన బిల్లులు రాలేక తీవ్ర మనస్తాపం చెందినట్లు సమాచారం. ఇదే క్రమంలో రెండు రోజుల క్రితం హుస్నాబాద్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయం ముందు 21 ఆదివారం రోజు మొదటిసారిగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. చొక్కా జేబులో తన చావుకు కారణం వీళ్లే అని నలుగురి పేర్లు తెల్లని కాగితంపై రాసినట్లు చెప్పారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు తనకు నచ్చజెప్పి అక్కడి నుండి ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా ఏసీపీ కార్యాలయం ముందు ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నప్పుడు అప్పుడే చర్యలు తీసుకున్నట్లయితే ఇక్కడి దాకా వచ్చేది కాదని కుటుంబ సభ్యులు చెబుతున్న విషయం.అయితే రెండవసారి ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్న సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఉరివేసుకొని చనిపోయినట్లు కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు తెలుస్తోంది. మొత్తంగా చూసినట్లయితే రెండు పర్యాయాలు సర్పంచ్ గా చేసిన తర్వాత అయిన అప్పు రూ. 50 లక్షలకు పైగానే ఉందని కుమారుడు బన్నీ వెల్లడించారు. బిల్లులు రాక గతంలోనే నాలుగు ఎకరాల భూమిని అమ్మినట్లు, అప్పు ఇంకా ఎక్కువ ఉండడంతో మిత్తికి మిత్తి పెరిగి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణ. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి చేరవేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. హుస్నాబాద్ ఏసిపి, సీఐ,ఎస్ఐ తో పాటు కోహెడ ఎస్సై అభిలాష్, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్, కొమురవెల్లి ఎస్సై మహేష్ ల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు జడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి రెడ్డి వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ ఇది ప్రభుత్వ హత్యగా అభివర్ణిస్తూ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పందిల్ల సర్పంచ్ తోడేటి రమేష్ మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేక మాజీ సర్పంచుల ఆశలను నీరుగారిస్తున్నదని ఆరోపిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ ది ఆత్మహత్య కాదు, ముమ్మాటికి ప్రభుత్వ హత్య**

మహమ్మదాపూర్ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ ది ఆత్మహత్య కాదని, ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్ ఆరోపించారు. తాను సర్పంచ్ గా చేసిన హయాంలో లక్షల రూపాయలు అప్పుగా తెచ్చి గ్రామ అభివృద్ధి కోసం వెచ్చిస్తే బిల్లులు రాక ఉన్న భూమిని పండ్ల తోటను అమ్మినా కూడా అప్పులు చెల్లించలేక మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. గతంలో పెండింగ్ బిల్లుల కోసం హైకోర్టుకు వెళ్లి కేసు వేయడం జరిగిందని అయినా కూడా సీఎం రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించకుండా ఉండడం అనేది దుర్మార్గ చర్యగా అర్థం చేసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లును చెల్లించాలని చివరగా హుస్నాబాద్ ఏసీపి ఆఫీస్ ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడడం జరిగిన కూడా ఏసీపీ సదానందం, స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించకపోవడం బాధాకరమైన విషయం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మాజీ సర్పంచ్ సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.50 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, పెండింగు బిల్డింగు బిల్లు చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు.

## హుస్నాబాద్ అమరవీరుల స్థూపం భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- వెంటనే విచారణ జరిపి అక్రమ నిర్మాణాలు తొలగించాలి...
- హుస్నాబాద్ సిపిఐ నేతల డిమాండ్.

**హుస్నాబాద్, జూన్ 23 ప్రజా తీర్పు**



హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని అమరవీరుల స్థూపం పరిధిలోని భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ పి. రాజు కుమార్ ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 1189/బి పరిధిలోని 8 ఎకరాల భూమిని 1973లో సీలింగ్ భూమిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రజా పోరాటాల్లో ప్రాణాలు అర్పించిన 88 మంది అమరవీరుల స్మారకార్థం 1990లో అక్కడ 88 అడుగుల ఎత్తైన అమరవీరుల స్థూపాన్ని నిర్మించారని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ 2013లో భూముల సవరణల సమయంలో కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సీలింగ్ భూములను తిరిగి పట్టా భూములుగా మార్పించుకుని అక్రమంగా పాస్‌బుక్ లో పొందారని ఆరోపించారు. అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి వెంచర్లు ఏర్పాటు చేసి కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్నారని అన్నారు. అమరవీరుల స్థూపం పరిధిలోని సీలింగ్ భూములపై జరిగిన అక్రమాలను వెలికితీసి, ఆక్రమణలను వెంటనే తొలగించాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కనుకుంట్ల శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య, నాయకులు నంగి కనకయ్య, ఏగుర్ల కిష్టయ్య, గుడేపు సుదర్శన్, సిద్దిరాం భద్రయ్య, గుడేపు సంతోష్, దండుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన జామే మసీదు కమిటీ సభ్యులు, పట్టణ ముస్లిం సోదరులు

**( కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) జూన్:23:**

వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో ఉన్న జామే మసీదు శిథిలావస్థలో ఉండటంతో, మసీదు పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ జామే మసీదు కమిటీ సభ్యులు, పట్టణ ముస్లిం సోదరులు మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్ ను సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సహకారంతో, కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు అబ్దుల్ రజాక్ పర్యవేక్షణలో జరిగింది. జామే మసీదు వక్ఫ్ బోర్డు పరిధిలోకి వస్తుందని, ప్రస్తుతం మసీదు భవనం శిథిలావస్థకు చేరుకుందని కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జామే మసీదు కమిటీ అధ్యక్షుడు నవాబ్ ఖాన్ మాట్లాడుతూ, మసీదు మరమ్మతులు మరియు పునర్నిర్మాణం కోసం పలుమార్లు వక్ఫ్ బోర్డు అధికారులకు వినతులు సమర్పించినప్పటికీ సమస్య పెండింగ్‌లోనే ఉందని తెలిపారు. మసీదు ప్రస్తుత పరిస్థితిని ప్రతిబింబించే ఫోటోలను మంత్రి అజారుద్దీన్‌కు చూపించి, వక్ఫ్ బోర్డు అనుమతులు ఇప్పించి, నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి అజారుద్దీన్, మసీదు సమస్య ఇన్ని సంవత్సరాలుగా ఎందుకు పెండింగ్‌లో ఉందని కమిటీ సభ్యులను ప్రశ్నించారు. అనంతరం వక్ఫ్ బోర్డు అధికారులతో సమన్వయం చేసి, సమస్యను త్వరితగతిన పరిష్కరించి మసీదుకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జామే మసీదు కమిటీ అధ్యక్షుడు నవాబ్ ఖాన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ మోసిన్, కోశాధికారి సయ్యద్ షబ్బీర్, యువ నాయకుడు, ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ సోయల్ ఖాన్, మహమ్మద్ ఆరిఫ్ (సచివాలయం),మరియు కమిటీ సభ్యులు, పట్టణ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం..

- సన్న రకాలు సాగు చేయండి
- రైతులకు మంత్రి అడ్లూరి సూచన
- ధర్మారంలో విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్ కుమార్..

**(జంగ మహేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి)**

**ధర్మారం జూన్ 23**



రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన వరి విత్తనాలు మాత్రమే సాగు చేసి ప్రభుత్వం అందించే బోనస్ పొందాలని మంత్రి కోరారు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్ లో పెద్దపల్లి జిల్లా కు 25 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం జిల్లాలో 21మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని కలెక్టర్ తెలిపారు. దోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు.కార్యక్రమం అనంతరం ధర్మారం మండలంలోని వివిధ గ్రామాల్లో కరెంట్ షాక్ తో మరణించిన కుటుంబాలకు నష్ట పరిహారం చెక్కులు మంత్రి లక్ష్మణ్ కుమార్ అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తో పాటు ఏసిపి గజ్జి కృష్ణ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య ధ్యాగేటి ఉదయ్ ఉపసర్పంచ్ ఎలిగేటి మల్లేశం గాగిరెడ్డి తిరుపతిరెడ్డి మాజీ ఎంపీపీ కొడారీ అంజన్న మేడారం సర్పంచ్ వీర్ పాల్ కాడె సూర్యనారాయణ రంజిత్ పాలకుర్తి రాజేషం శీ చిరంజీవి రాజేశం ఎల్లయ్య వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు



## దేశ సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహానేతకు ఘన నివాళులు

**(వినోద్, ప్రజా తీర్పు, కిసర, మేడ్చల్ జిల్లా,) జూన్ 23**

మేడ్చల్ జిల్లా, కీసర: భారతీయ జనతా పార్టీ కీసర డివిజన్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.మంగళవారం కీసర డివిజన్ అధ్యక్షుడు కోల బాలరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశ రాజకీయాల్లో జాతీయవాద భావజాలానికి బలమైన పునాది వేసిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేడు భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించి ప్రజల ఆదరణ పొందడంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు, కృషి కీలక పాత్ర పోషించాయని తెలిపారు. దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం ఆయన చేసిన పోరాటం యువతకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండెబోయిన ఐలయ్య యాదవ్, కొలుకూరి నగేష్ ముదిరాజ్, దొబ్బల శ్రీశైలం, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శులు నల్ల వెంకటరెడ్డి, అబ్రబోయిన నాగరాజ్, ఉట్కూరి పవన్ గౌడ్, సీనియర్ నాయకులు అబ్రబోయిన జంగాలు, అన్నోజిగూడ మల్లారెడ్డి, గోసుల శ్రీనివాస్, తర్రె సత్యనారాయణ, కోల మల్లేష్ యాదవ్, సీహెచ్ సత్యనారాయణ, చంద్రమౌళి చారి, సాయి గౌడ్, మహేష్ ముదిరాజ్, నాగరాజు, కె. శ్రీనివాస్, కుమార్, జి. మధు, బాలకృష్ణ, పి. లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించుకోవాలి

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 23.**



జగిత్యాల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించుకోవాలి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ కు లేఖ రాశారు. జగిత్యాల పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై ఆయన స్పందించారు. ఇప్పటికే తహసీల్ చౌరస్తా ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ సముదాయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, జగిత్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జనాభా ప్రాతిపదికన మరో పట్టణ తహసీల్దార్ కార్యాలయం కూడా మంజూరయ్యే అవకాశం ఉన్నందున ప్రజల రాకపోకలు మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యలు, భద్రతా సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు పాత బస్టాండ్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలిసిందని, అక్కడ రహదారి వెడల్పుగా ఉండటంతో వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తక్కువగా ఉంటాయన్నారు.అందువల్ల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు విషయమై ఏవైనా ప్రతిపాదనలు ఉంటే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటిని నిలిపివేయాలని కలెక్టర్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు.



## బైక్ చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

- 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న కుషాయిగూడ పోలీసులు

**(వినోద్, ప్రజా తీర్పు, కుషాయిగూడ, మేడ్చల్ జిల్లా) జూన్ 23**

మేడ్చల్ జిల్లా, కుషాయిగూడ ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని మంగళవారం కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 14 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పెరుగుతున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ప్యారారం గ్రామానికి చెందిన చిందం రాజు వయసు 27 పెయింటింగ్ పనులు చేస్తూ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బైక్ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితుడు కుషాయిగూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించినట్లు అంగీకరించడంతో అతని వద్ద నుంచి మొత్తం 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ లక్షల రూపాయలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. అలాగే నిందితుడు గతంలో 2022 సంవత్సరంలో ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా పలు చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలిందని డీసీపీ తెలిపారు. బైక్ చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చుకోవడంతో పాటు బలమైన లాకింగ్ వ్యవస్థలను ఉపయోగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసును ఛేదించిన కుషాయిగూడ పోలీసు బృందాన్ని డీసీపీ అభినందించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020